


# ఎవరు?

కథ పూర్తిచేసి తలెత్తి చూసేసరికి భరద్వాజ కుతూహలంగా చూస్తున్నాడు నావంక. నెంబర్ల ప్రకారం కథ రాసిన కాయితాలు బొత్తిపెట్టి, పెన్ కేప్ పెట్టి డ్రాయర్లో పడేశాను.

'ఏదీ, యిలా తే, చదివి చూస్తా' అన్నాడు భరద్వాజ్, అంతవరకూ నిశ్శబ్దంగా కూర్చున్నవాడల్లా. నేను ఒక్క క్షణం సంశయించాను. నాకు తెలుసు, ఏదో వంక పెడతాడు. అయినా తప్పదు. కోప మొస్తుంది చూపించకపోతే!. బొత్తిపెట్టిన కాయితాలకి పిన్ పెట్టి భరద్వాజ ముందుకు తోశాను. కథ చదవటం ప్రారంభించినప్పటి నుంచీ పూర్తి అయేవరకూ వాడి మొఖంలో మారుతున్న భావాలకేసి చూస్తూ కూర్చున్నాను.

'భానూ, యిదా నీ రచన. నువ్వు సృష్టించిన వ్యక్తులే నా వీళ్ళు' అన్నాడు భరద్వాజ కథ పూర్తిచేసి వ్యాఖ్యానానికి నాందీ వాక్యం పలుకుతూ.

'ఉహుఁ, నే నొప్పుకోను భానూ. ఈ కథలో నువ్వు చెప్పిన వ్యక్తు లుండరసలు. నీకు లోకం మంచి చెడ్డలు ఎంత వరకూ తెలుసు? నీ కథలో ఆడవాళ్ళు తప్ప మొగ వాళ్ళంతా, చెడ్డవాళ్ళూ హృదయం లేని వాళ్ళేనా? నిజంచెప్పు భానూ మొగవాళ్ళని గురించి నీ అభిప్రాయంకూడా యిదేనా?' అన్నాడు భరద్వాజ. నాకు చిరా కనిపించింది. ఏమిటిది? అర్థంలేని సంభాషణ. నేను ఏదోరాస్తే దాన్ని గురించి, ఏకంగా నాఅభిప్రాయమే అడుగుతున్న భరద్వాజని గురించి ఏమనుకోవాలో తెలీలేదు.

'నువ్వు తప్పు అభిప్రాయ పడుతున్నావన్నయ్యా! నా వుద్దేశ్యం మగవాళ్ళు చెడ్డవాళ్ళని కాదే! నిర్మల జీవితం చెప్పటం మాత్రమే!' అన్నాను నేను కొంచెం కోపంగా నే.

'పిచ్చిపిల్లా! జీవితంలో ఏ వ్యక్తీ కష్టాల్ని కోరుకోడు కదూ! ప్రశాంతమైన సంసారసుఖం కావాలనే వాంఛిస్తాడు ఏ వ్యక్తికీ తన బిడ్డల మీద ప్రేమ వుండదని పొరబడకు చెల్లాయ్. నీ కథలోని వ్యక్తులు బజార్నపోయే మామూలు మనుషులు కారు. సంఘానికి దూరంగా ఏదో చాలా దూరంగా మూల కూర్చుని బాధపడే వాళ్ళే. ఎంత రెండోపెళ్ళయినా రాంబాబు ప్రవర్తన చిత్రంగా లేదూ! సంస్కారం లేనివాళ్ళకు కూడా భార్య అంటే ఏ మూలో ప్రేమ వుంటుందే! అందునా నీ కథలోని వ్యక్తి సంస్కారవంతుడుకూడాను. నీకు తెలీదు. లోకంఅంటే ఏమిటి? అదీకాక కమలకి పదహారేళ్ళొచ్చేవరకూ నిర్మలకి తన కూతురని తెలీకుండా వుందా? పోనీ అది వదిలేద్దాం. కథ ఎండింగ్ లో చూడు. కమల తన కూతురని తెలిసి కూడా బిడ్డని ఎందుకంది? చేతనైతే అక్కడేదో సైకలాజికల్ ఎఫెక్టు తీసుకురా. కథలకి యింతకన్నా మంచి మేటర్ దొరకదా? సొసైటీలో ఎన్ని మంచి చెడ్డలు లేవూ? అవి విమర్శించరాదూ! నువ్వు కథ రాశావూ అంటే, నీ నుంచి సంఘం ఏదో వాంఛిస్తోం దన్నమాట. హ్యూమన్ సైకాలజీ ప్రతిబింబించేట్లు చెయ్యి భానూ... ...' అన్నాడు భరద్వాజ, నాకు ప్రశ్నవేసే టైము కూడా లేకుండా. నేను నివ్వెర పోయాను. నా కథలో యీ తప్పు లన్నీ వున్నమాట నిజమే కావచ్చు! కానీ అన్నయ్యలా భవిష్యత్తుని ఉజ్వలంగా వూహిస్తూ ఆనందించేవాళ్ళని నే నెక్కడా చూడలేదు.

'నే నంతకంటే ఒప్పుకోను. అటువంటి వ్యక్తులు లేరనకు, ఉన్నారు.

## కె. త్రిపుర

ఉండి తీరాలి. ఉంటారు కూడాను. ప్రతివాడూ నీలాగే ఆలోచిస్తాడా ?' అన్నాను.

'నాలాగే, ఆలోచిస్తారను కుంటాను నేను' అన్నాడు అన్నయ్య నా వంక వింతగా చూసి నవ్వేస్తూ.

'నేనూ, ఎవరో ఒకర్ని దృష్టిలో పెట్టుకుని రాస్తాను. ఆ మాట నువ్వు మర్చిపోతున్నావ్ అన్నయ్యా'

'నీ కథలోని వ్యక్తులు లక్షకి కూడా ఒకళ్ళుండరు...' అన్నయ్య మాట పూర్తి కాక మునుపే, కాయితాలు చేతిలోకి తీసుకున్నాను.




వినుగ్గా అనిపిస్తోంది. చింపెయ్యా లనిపించింది.

అన్నయ్య చటుక్కున కుర్చీలో నుంచి లేచి వచ్చి నా చేతిలోని కాయితాలు తీసుకున్నాడు. 'చింపుదామని అనుకుంటున్నావా ? ఒద్దు' అన్నాడు పేజీలు తిరగేస్తూ.

'ఇలాటివాళ్ళు వుండరంటావా?' అన్నాను నేను. లోపల అనుమానం పీకుతున్నా. ఎలాగయినా అన్నయ్య చేత వుంటా రనిపించాలని నా విశ్వ ప్రయత్నం.

'ఉంటారా ? ఉండరా ? అనేది ప్రశ్న కాదసలు. ఉండవచ్చు. కానీ అటువంటి వాళ్ళని నువ్వు ఎంత దాకా ఎరుగున్నావూ ? నిష్పాక్షికంగా విమర్శించగల జ్ఞానం నీకుందా ? ఏ పాత్రమీదో ప్రీతికొద్దీ అవతల వాళ్ళని నిర్లక్ష్యం చెయ్యనూ వచ్చుగదా ! అది మాత్రమే నే నడుగుతున్నది.' అన్నాడు అన్నయ్య. నేను మౌనంగా వూరుకోవటం కన్నా గత్యంతరం లేదు. ఎవరో ఎవర్ని గురించో అనుకున్న నాలుగు మాటల ఆధారంగా కథ రాసి కొండంత ఆత్మ విశ్వాసాన్ని పెంచుకోవటం నా తప్పే. అయినా అన్నయ్య చెప్పింది కూడా నిజమే మరి ! నా అహం దెబ్బతింటుంది అన్నయ్య మాట ఒప్పుకుంటే అని నా బాధ. భార్యని ప్రేమించని భర్తలూ, పిల్లల్ని ప్రేమించని తండ్రులూ వుండరని అన్నయ్య కెందు కంత దృఢమైన అభిప్రాయం?

● ● ●

ఒకో సంఘటన ఎందుకు జరుగుతుందో అర్థంగాని ప్రశ్నగానే వుండిపోతుంది.

ఈవేళ సరిగ్గా అలాటిదే జరిగింది. ఆదివారం కావటంవల్ల అన్నయ్య యింట్లోనే వుండిపోయాడు. ప్రొద్దున్న ఎవరో ఫ్రెండుకి చూపిస్తానంటూ నా కథ తీసుకెళ్ళి డ్రాయింగ్ రూమ్ లో కూర్చున్నాడు. అతనెవరో రచయిత అనే చెప్పాడుగానీ నేనాట్టే పట్టించుకోలేదు.

ప్రత్యక్షంగా అత నేమన్నాడో నేనైతే వినలేదుగానీ, మధ్యాహ్నం తీరుబడిగా కాయితాలు చేతిలోకి తీసుకున్నప్పుడు మటుకూ తెల్లబోయాననే చెప్పాలి. నే రాసిన పేపర్లనిండా రెడ్ యింక్ తో అండర్ లైన్లూ రిమార్కులూ ... అతను పేరు పొందిన రచయిత, నేను మొదటిసారి కథ రాసినా మెచ్చుకోకపోయినా మరీ యింత అధ్వాన్నంగా ప్రవర్తిస్తాడని నే ననుకోలేదు.

ఆకాశం గది కిటికీలోనుంచి దూరంగా తెరిపిగా కనిపిస్తోంది. కిటికీ ప్రక్కగా వున్న లిల్లీ మొక్క పొడుగ్గా ఎదిగి రెండు తెల్లపూలు పూసి గాలికి అటూ యిటూ వూగుతోంది.

'నీ స్నేహితుడు చాలా మంచివాడు సుమా !' అందా మనుకున్న నాకు ప్రభాకరబాబు రాక అంతరాయం కలిగించింది.

ఆరడుగుల అందమైన పచ్చటి విగ్రహం ప్రభాకరం. అన్నయ్యతో పాటు ఫైనలియర్ ఎమ్. బి. చదువుతున్నాడు. ఇంటరు నుంచీ అన్నయ్యా అతనూ సహాధ్యాయులు. అన్నయ్య దృష్టిలో ప్రభాకర మొక బంగారు పిచ్చుక. నేను నవ్వుతూ అంటుంటాను 'బంగారు పంజరం కూడా వుందా ?' అని. తమాషాగా తల తిప్పుతూ 'వున్నట్లే లెఖ్క' అంటాడు అన్నయ్య. అతనిలో విలక్షణమైన విశేషాలేం కనిపించ లేదు. హుందాగా మృదువుగా కదిలే అతనిలో భావాల కదలిక గమనించటం కష్టమే మరి !

అన్నయ్యకీ అతనికీ మధ్య అగాధాలు అడ్డం. వాటి అవతలి ఒడ్డు నొకళ్ళూ, యివతలి ఒడ్డు నొకళ్ళూ నిలబడి స్నేహ పూర్వకంగా చేతులు కలుపుకుని నిలబడగలరు.

'ఏవిటోయ్ విశేషాలు' అన్నాడు ప్రభాకరం లోపలి కొస్తూనే.

నేను నవ్వి లోపలికి వెళ్ళిపోయాను. నేను కాఫీతో తిరిగి వచ్చేసరికి 'అందుకన్న మాట చెల్లాయ్ కి కోపం వచ్చింది' అంటున్నాడు ప్రభాకరం, నా వెనకనే. అన్నయ్య మామధ్య జరిగింది చెప్పి వుంటాడనేది నాకు తెలియందికాదు.

'చూడు భానూ ... ప్రభాకరమేదో మాంఛి జడ్జిమెంటు చెప్తా

నన్నాడు, అందుకే నీ కథను రికమెండ్ చేశాను. అదిగాక నలుగురూ నిన్ను గుర్తించ వద్దూ...' అన్నయ్య నన్ను చూస్తూనే వుత్సాహంగా చెప్పాడు.

ప్రభాకరం కాఫీ సిప్ చేస్తూ నవ్వుతూ మా యిద్దరివంకా చూశాడు.

హాల్లోని గోడగడియారం నాలుగు కొట్టింది. ఆకాశంలో మబ్బులు దట్టంగా కమ్ముకుంటున్నాయి. కిటికీ అవతల రెండు చిన్న చిన్న పొడుగు ముక్కు పచ్చ పిట్టలు వుండి, వుండి లిల్లీ పువ్వులు అందుకోవాలని చూస్తున్నాయి. గదిలో కాలెండర్ అడుగున తారీఖుల కాగితాలు పల్చటి శబ్దం చేస్తున్నాయి. గదిలో పల్చటి చీకటితెర జారినట్లుగా వున్నది.

చేతులు కట్టుకుని బల్లమీద ముందుకు వంగి కూర్చున్నాడు కుర్చీలో ప్రభాకరం.

'నీ కింతకీ చెల్లాయ్ రాసిన కథ నచ్చలేదంటావ్' అన్నాడు ప్రభాకరం యింతసేపటికి మా ముగ్గురిలో తనే మాట్లాడుతూ.

'పోనీ నేనూ ఓ కథ చెప్పనా?' అన్నాడు ప్రభాకరమే.

'హరి భగవాన్! అందరూ కథలు చెప్పేవాళ్ళే. చెప్పు చెప్పు విందాం. ఏదో వర్షానికి కాస్త కాలక్షేపం' అన్నాడు అన్నయ్య. లేచి లైటువేస్తూ.

లైటు వర్షపు తుప్పర ప్రారంభమైంది. కిటికీలోని లిల్లీ మొక్కమీది పిట్టలు ఎగిరిపోయినట్లున్నాయి.

నా ప్రాణం వుసూరుమంది. ఏదో జడ్జిమెంటు గిడ్జిమెంటు అన్నవాడు తానే కథ చెప్పటానికి తయారయ్యాడు. చిత్రమే మరి!

ప్రభాకరం కథ చెప్పటం మొదలుపెట్టాడు. లైటు వర్షం నిలబడి కురుస్తోంది. కిటికీ చువ్వల్లోంచి లైటు కాంతి బైటి వర్షపుధారలమీద పడి బంగారు తీగల్లాగ మెరుస్తున్నాయి వర్షపుధారలు.

● ● ●

దూరంగా కొండలమీద మబ్బు పట్టి చల్లగాలి వేస్తోంది. తోటలో రాజయ్య మొక్కలకు గొప్పులు త్రవ్వుతున్నాడు. విరగపూసిన గులాబీలు సువాసనలు వెదజల్లుతున్నాయి.

ప్రభాకరబాబు వరండాలో పేము కుర్చీలో కూర్చుని జారిపడుతున్న సన్నటి నీటి ధారలవంక చూస్తున్నాడు.

అత్తయ్యపోయి అప్పుడే యివాళ పదమూడో రోజు. చాలామంది చుట్టాలు పన్నెండోరోజే వెళ్ళిపోయారు. ఒకరిద్దరు మిగిలిన చుట్టాలు యీవేళ ప్రొద్దుట వెళ్ళిపోయారు. ఈ పన్నెండు రోజుల సందడి ఒక్కసారి ఎగిరిపోయి నిశ్శబ్దం నిరుత్రమ్మినట్లుగా వుంది.

'అమ్మలాటి అత్తయ్య చనిపోయింది. ఏదో ఆవేదనగా అనిపిస్తోంది' అనుకున్నాడు ప్రభాకరం. నిన్న మొన్నటిదాకా అత్తయ్య గుండెల్లో తల దాచుకున్న తను... ఈ రోజు నిరాధారుడు. తల్చుకుంటే ప్రభాకరానికి చిత్రంగా అనిపిస్తోంది.

గేట్లో పంకజలక్ష్మి కనిపించింది. ఆవిడ అత్తయ్య పేర జరుగుతున్న స్కూలు కార్యదర్శిని. 'ఏం పనిమీద వచ్చిందో?' అనుకున్నాడు ప్రభాకరం.

'ప్రభాకరబాబూ, మావయ్య లేరా?' అంటూ వరండా మెట్లెక్కి పైకి వచ్చింది.


నేను చూచిన అమెరికా

రచన : అక్కినేని నాగేశ్వరరావు

[ప్రసిద్ధాంధ్ర చలనచిత్ర నటుని అమెరికా యాత్రానుభవాలు]

*32* పేజీల ఛాయాచిత్రాలతోసహా *96* పేజీలు

సాధారణ ప్రతి రు. 2-50. | లైబ్రరీ ఎడిషన్ రు. 3-50

● ● ●

కూనలమ్మపదాలు [ఆరుద్ర రచన]

వెల : రూపాయి

● ● ●

రసికజన మనోభిరామం

[పదే పదే నవ్వదగిన జోకులు, కార్టూన్ల సంకలనం]

వెల : రూపాయి

ప్రక్క పేజీలోని పుస్తకాలకు

జ్యోతిబుక్స్, విజయవాడ-2

చిరునామాకు వ్రాయండి.

[లేదా మీ వూరిలోని 'జ్యోతి' ఏజెంట్ ద్వారా తెప్పించుకోండి.]

'నమస్కారం పంకజమ్మగారూ! ఉన్నారు. రండి పిలుస్తాను.' అన్నాడు ప్రభాకరం లేచి నిలబడి. పంకజ లక్ష్మికి ఏభై ఏళ్ళుంటాయి. నిండుగా కప్పుకున్న ఖద్దరు చీర పమిటలో పచ్చగా గుమ్మటంలా వుంటుంది.

ప్రభాకరం లేచి వెళ్ళకుండానే విశ్వనాథంగారు వచ్చారు. నమస్కార ప్రతి నమస్కారాలయ్యాక పంకజలక్ష్మి ప్రారంభించింది :

'మొన్న నొకసారి వచ్చాను మిమ్మల్ని కలుసుకోవాలని. వీలుపడ లేదు. స్కూలుకు పట్టుగొమ్మలాటి వ్యక్తి, పది కాలాలపాటు బ్రతకదగ్గ వయసూ వున్న రాజ్యలక్ష్మిగారు పోవటం తీరని లోటు. పెద్ద కష్టమే కలిగిందీ వయసులో మీకు. క్రిందటి సారి ఆవిడా నేనూ కలిసినప్పుడు పేరు మార్చాలని వుందనీ, మీతో చెప్పి గట్టి ప్రయత్నం చేయిస్తాననీ......' పంకజలక్ష్మి మాట పూర్తికాక మునుపే,

విశ్వనాథంగారు లేచి నిలబడ్తూ 'నాకూ ఆ విషయమే చెప్పింది. ఊహుఁ, నా కిష్టం లేదమ్మా. ఎప్పటికీ రాజ్యలక్ష్మి పేరనే వుండాలి.' అంటూ చేతులు జోడించి నమస్కారంచేసి లోపలికి వెళ్ళిపోయారు.

ప్రభాకరం పంకజలక్ష్మికేసి తిరిగి 'ఏ పేరని చెప్పిందండీ? అత్తయ్య' అన్నాడు.

'అన్నపూర్ణ అని కాబోలు. సరే! ఆ విషయమై ఆయన అభిప్రాయం తేలిపోయింది. ప్రభాకర్, మావయ్యని కనిపెట్టి వుండు. వస్తానోయ్' అన్నది పంకజలక్ష్మి లేచి వెళుతూ.

ప్రభాకరానికి చటుక్కున రాజ్యలక్ష్మి డైరీ గుర్తొచ్చింది.

ఆవిడ మరికొద్ది రోజుల్లో పోతుం దనగా ప్రభాకరాన్ని పిలిచి 'ప్రభా, నీకు వీలున్నప్పుడిది చదువు నాన్నా. ఇది నీ దగ్గరగాక మరొకరి దగ్గర భద్రంగా వుంటుందంటే నమ్మలేను' అన్నది. అప్పుడా డైరీని పుస్తకాల బీరువాలో పెట్టేశాడు. ఆ తరువాత ఆవిడ జబ్బూ, పోయిన హడావిడిలో మరిచిపోయాడు దానిమాట. ఇప్పుడెందుకో పంకజమ్మని చూస్తే డైరీ గుర్తొచ్చింది.

కొండలమీది మబ్బు విడిపోయి ఎండపొడ వస్తూంది. ప్రభాకరం తన గదిలో కూర్చుని అత్తయ్య డైరీ తెరిచాడు.

● ● ●

ఇది డైరీ కాదు. బహుశా ఏదీ కూడా కాక పోవచ్చు. ఇందులో నేనేదో మహా కష్టపడి పోయాననీ, సంసార సాగరం యీద లేననీ రాయ బోవటం లేదు. నా జీవితంలో ఒకే ఒక్క 'చిత్రమైన' సంఘటన జరిగింది. ఇది యిలా జరుగుతుందా? అన్న నా ఆలోచనలో జరిగిపోయిన సంఘటన తరుగు మెరుగుల్ని కాల గతి మార్చేసింది. అది పూర్తిగా మరిచి పోకముందే నాకు గుర్తున్న వరకూ రాసి, ఎప్పుడన్నా జీవితపు సంధ్య వెలుగులో నడచి వచ్చిన





దారికేసి చూసుకుని ఆశ్చర్య పడటమో, ఆనంద పడటమో చెయ్యాలి. అందుకే రాస్తున్నాను.

* * *

నేను కాలేజీ నుంచి యింటికి వచ్చేటప్పటికి క్రింది హాల్లో ఎవరూ కనపించలేదు. పనిమనిషి సుబ్బులు సన్నజాజులు కోస్తోంది.

'సుబ్బులూ! అమ్మేదీ?' అన్నాను అది వేలుపెట్టి పైకి చూపించింది. అమ్మ మేడమీద వుందన్నమాట. ఈ వేళ గంటముందే వచ్చాను కాలేజీ నుంచి. ఎక్కడికన్నా వెళ్ళాలి సర దాగా. నవ్వుకుంటూ మెట్లెక్కుతున్నాను.

గదిలో నాన్నా, అమ్మా మాట్లాడుతున్నారు. చివరి మెట్టుమీదే నిలిచి పోయాను.

'కడిగిన కాళ్ళు కడగటం, చేసిన దానమే చెయ్యటం ధర్మంకాదు. మనకైనా యిది మొదటి కార్యమే గదా! ఎంత చదువు, ఆస్తి వున్నా రెండో పెళ్ళి రెండో పెళ్ళే. నా కూతుర్ని చస్తే రెండో పెళ్ళి వాడికి యివ్వననే నా మాట. మీ ముందు అనవసరమే. అది నా కూతురేగాదు, మీ పిల్లకూడాను.' అమ్మ గొంతు దృఢంగా వినిపిస్తోంది.

'అతను వచ్చివెళ్ళాక, రాజు యిష్టాన్నికూడా సంప్రతించే చేద్దాం. ఐనా మరొకసారి ఆలోచించుతులసీ' నాన్నగారి గొంతు నచ్చచెప్పే ధోరణిలో మృదువుగా వినిపిస్తోంది. కొంత వరకు సంభాషణసారాంశం గ్రహించి మెట్లుదిగి హాల్లోకి వచ్చేశాను

నా వెనకనే అమ్మా, నాన్నా కూడా వచ్చేశారు.

---



ఒక కోటీశ్వరుడు కుమార్తెతో పాటు ఓడలో ప్రయాణం చేస్తుంటే, కూతురు కాస్తా నీళ్ళలో పడింది. ఆయన గుండెలు బాదుకుంటూ 'నా కూతురోయ్. రక్షించండోయ్. రక్షించినవాడికి వెయ్యి రూపాయిలిస్తానోయ్' అని కేకలు పెట్టాడు. ఇంతలో నీళ్ళలో మరో చప్పుడైంది. అమ్మాయి దగ్గరగా ఇంకోమనిషి కనిపించాడు. బోటుదింపి ఇద్దర్నీ ఓడలోకి లాగారు. కోటీశ్వరుడు ఆ మనిషి దగ్గిరికి పరిగెట్టుకెళ్ళి 'నాయనా! నా తల్లిని రక్షించావు. నీకు వెయ్యి రూపాయిలూ ఇచ్చి తీర్తాను,' అన్నాడు.

'నీ వెయ్యి రూపాయిలు అలా వుంచవయ్యా. నన్ను నీళ్ళలోకి తోసిన పెధవేడీ?' అన్నాడతడు.

'అప్పుడే వచ్చేశావా రాజా?' అన్నారు నాన్న నన్ను చూసి. తల వూపి అమ్మ వెనకనే లోపలికి వెళ్ళను. అమ్మ చెప్పింది ఎవరో ఎం.బి.బి.ఎస్. డాక్టరనీ, చాలా ఆస్తిపరులనీ, రెండో పెళ్ళని వివరాలు చెప్పింది.

ఆకుపచ్చంచు తెల్లసిల్కు చీర, తల్లో సన్నజాజులతో పెళ్ళి చూపులకు సిద్ధమయ్యాను. పెద్దచెల్లాయ్ నన్ను చూసి చూసి "తెల్లగా జాజిమొగ్గలా వున్నావ్ రాజక్కా" అన్నది.

పెళ్ళిచూపులు ఆధునికంగా 'టీ'కి పిలిచిన పెద్దమనిషికి పరిచయం చేసినట్లు జరిగాయి. నాన్న నన్ను చూపించి 'మా పెద్దమ్మాయి, బి. ఎ. మొదటి సంవత్సరం. పేరు రాజ్యలక్ష్మి' అన్నారు. నేను నమస్కారం చేశాను. అతను నవ్వుతూ విష్ చేశాడు. నాన్న అతని వెనకనే వెళ్ళారు. అమ్మ నన్ను పిలిచి "ఎంతయినా కాగి చల్లారిన పాలు, ఆలోచించు తల్లీ" అన్నది.

అరగంట తర్వాత నాన్న నన్ను పిలిచి "రాజా! ఇష్టమేగదమ్మా?" అన్నారు. నేను అచేతనంగా తల వూపేను. అమ్మ చెప్పిన లాభనష్టాలు బేరీజువేసే స్థితిలో లేను. తెల్లటి బట్టల్లో అతను పచ్చటి విగ్రహమే మెదుల్తోంది నా కళ్ళల్లో. ఏదో ఆకర్షణకి లొంగిపోయాను. అమ్మ ఎటువంటి వ్యతిరేకతా చూపలేదు ఆ తరువాత. పెళ్ళి జరిగిపోయింది.

* * *

శ్రావణమాసంలో కాపోలు కాపరానికి వచ్చేను. పదిపదిహేను రోజులు క్రొత్తదనంతో బాధపడ్డాను. ఇంటి మొత్తంమీద నేనూ, ఆయనా, భర్త పోయిన పెద్దాడబడుచు సావిత్రి, కొడుకు మూడేళ్ళ ప్రభాకరమూను. దొడ్లోపాకలో రాజయ్య మాణిక్యం, ఇంటిపనులు చూసేది, రాజయ్య తోటపనులు చూసేవాడు.

చక్కటి మేడ, చుట్టూ అందమైన పూలతోట. సాయంత్రాలు తోటలో లైట్లు అందంగా వెలుగుతాయి. ఆ వెలుగులో పాలరాతి కృష్ణవిగ్రహం మురళిలోనుంచి జారిపడే నీటిజల్లులు ప్రశాంతంగా చూస్తూ సాయంత్రాలు గడిపేదాన్ని.

ఒకరోజు మధ్యాహ్నం వింతోచక మేడమీది గదులు చూస్తున్నాను. దక్షిణంవేపు జాళ్ళ వేసివున్న గది తలుపులు తీసుకువెళ్ళిన నన్ను ఆకర్షించింది అద్దాలబీరువాలోని రాధాకృష్ణుల విగ్రహం.

మధురమైన కృష్ణుని మురళీగానం వింటూ రాధ అరమూసిన కళ్ళతో లోకాన్ని అతని భుజాలమీదుగా తన్మయత్వంతో తిలకిస్తున్నట్లు, తెల్లటి గోవు రాధకి తీసిపోని తన్మయత్వంతో రక్షణగా వారిద్దర్నీ చుట్టి నిలబడుతూ వున్నది. రుక్మిణీ దేవి శ్రీకృష్ణుని వర్ణిస్తూ నీ మేఘ శ్యామల దేహానికి, మెడలోని గురివింద పూల మాలకి, ఎట్టిది పెదవుల మీద అంటిన రాధ నల్లని కాటుకకీ సరిపోయింది దన్నదని అమ్మమ్మ చెప్పింది గర్తొచ్చి ఏదో ఆలోచిస్తూ అలా ఎంతసేపు నిల్చున్నానో నాకు తెలీదు.

"అంత బాగుందా ఆ విగ్రహం" అన్నారాయన నా భుజాలమీద చేతులు వేసి. నేను 'ఔ'నన్నట్లు తల వూపేను.

"అదక్కడి నుంచి తియ్యటానికి వీల్లేదు రాజా" అన్నారాయన నన్నొదిలేస్తూ.

"టేబుల్‌మీద పెట్టుకుంటే ఎంత బాగుంటుందీ" అన్నాను. ఆయన నా మాటకు మరి సమాధానం చెప్పకుండా గదిలోకి వెళ్ళిపోయారు. నా మత్తు వదిలిపోయింది. విస్తుపోయి నిలబడ్డాను.

* * *

ఆ వేళ పదిగంటలకి లేడీ డాక్టరు వచ్చింది. సావిత్రి నా గదిలోకి వచ్చింది. ఆయన డిస్పెన్సరీకి వెళ్ళిపోయారు.

"రాజ్యలక్ష్మి, డాక్టరు వచ్చింది. వెళ్ళి పరీక్ష చేయించుకోమ్మా" అన్నది సావిత్రి.

"ఎవరి కోసం?" అన్నాను నేను తెల్లబోయి.

"నీ కోసమే" అన్నదావిడ.

"ఎవరు పిలిపించారు?" నామరొక ప్రశ్న.

"నేనే పిలిపించాను. ఇహ ప్రశ్నలు వెయ్యటం ఆపి వెళ్ళు" అన్నదావిడ ఒక్క క్షణం నన్ను పరిశీలనగా చూసి. నేను మాట్లాడకుండా ఆవిడ వెనకనే వెళ్ళాను.

"మూడో నెల వెళ్ళిపోతుంది. మీకు మేనల్లుడో మేనకోడలో సావిత్రమ్మగారూ!" అన్నది లేడీ డాక్టరు నవ్వుతూ. సావిత్రి ఎటువంటి భావ ప్రకటనా చేయలేదు.

రాత్రి వెన్నెట్లో కూర్చున్నప్పుడు ఆయన అడిగారు. దొడ్లో పాకలో రాజయ్య తమ్ముడు పిల్లనగ్రోవి సాధన చేస్తున్నాడు.

"అక్కయ్య చెప్పింది, నీకు మూడో నెలటగదూ! చిత్రమే! అన్నపూర్ణకి లేని అదృష్టం నీకు పట్టింది రాజా. అదృష్టవంతురాలివి. సంతోషం." అన్నారాయన లేచి వెళుతూ. అన్నపూర్ణ ఆయన మొదటి భార్య. రాజయ్య తమ్ముడి పిల్లనగ్రోవి అపశ్రుతి పలుకుతోంది.

చెప్పలేని ఆవేదన క్రమ్ముకొచ్చింది. ఇంత సంతోషమైన వార్తకి నిస్సారమైన ఓదార్పా? ఊహుం!! కుర్చీ చేతిమీద చేతులు పెట్టి అమాయకంగా నా వంక చూస్తున్న ప్రభాకరం కనిపించాడు. చప్పున గుండెలకి హత్తుకున్నాను.

* * *

నా రెండో ఆడబిడ్డ శైలజ కూడా

● సాధారణంగా పిడుగు ఒకసారి పడ్డచోట మళ్ళీ పడదంటారు. దానికి తెలుసు దండగని.

గర్భిణీతో వుంది. పురిటికి పుట్టింటికొచ్చింది. పసుపు కుంకుమ యివ్వటానికి వచ్చిన అమ్మతో హడావుడేం చెయ్యొద్దని ఆయన సావిత్రిచేత చెప్పించారు.

'పురిటికి పంపించటం అన్నయ్యకిష్టం లేదు. అదీగాక శైలుక్కడ నెల్లేగదా ! మీరు మరో విధంగా భావించకండి అత్తయ్యగారూ !' అన్నది సావిత్రి అమ్మతో. అన్నిటికీ అమ్మ ముభావంగా వూరుకున్నట్లు కనిపించింది.

శైలజ చేత, నెమలి పింఛం రంగు పట్టుచీర వెండి పళ్ళెంలో పెట్టి పంపించారు. నిజానికది నాకు నచ్చలేదు. ఈ యింట నాకు గల ప్రత్యేకతేమిటో తెలుసుకోలేక పోతున్నాను. కిటికీ తెరలు మార్చటం దగ్గర్నుంచీ ఏదో నియమబద్ధంగా, నా ప్రమేయం లేకుండా జరిగి పోయే యీ యింటి పద్ధతుల వెనక ఏదో అదృశ్య హస్తం వుంది. అది నా భర్త మొదటి భార్య అన్నపూర్ణది కావచ్చు.

టైఫాయిడ్‌లో పురుడొచ్చింది. కళ్ళు తెరిచి చూసేసరికి ఆదుర్దాగా చూసే ప్రభాకరం పసి ముఖమే కనిపించింది. నాలుగు రోజుల తరువాత ఒళ్ళు తెలిసిన నాకు ఖాళీ వుయ్యాల చూసి పరిస్థితి గ్రహించటానికి ఎక్కువసేపు పట్టలేదు. నాకూ శైలజకీ ఒకటి రెండు గంటల తేడాగా పురుడొచ్చిందని, శైలజకి ఆడపిల్లనీ, నాకుపుట్టిన మగపిల్లాడు పోయాడనీ చెప్పారు. అమ్మ మటుకూ ముభావంగా వుండిపోయింది. శైలజ కూతురికి ముద్దుగా రాధికని నామకరణం చేశారు.

నాలుగేళ్ళ తర్వాత కాబోలు నేను పండక్కి వెళ్ళినప్పుడు అమ్మ 'వానలేని వరదా పిల్లల్లేని......' ఏదో సామెత చెప్పినట్లు, తోకపీకుడల్లే ప్రభాకర 'మెందుకే? మళ్ళీ నెలన్నా తప్పలేదు. అందులో మొగుడు డాక్టరుకూడాను... ...' అమ్మ నవ్వుతూ అంటున్నా అందులోని వ్యంగ్యం అర్థం చేసుకోలేనా నేను.

ఒకసారి యిదేవిషయం నేను కదిపినప్పుడు, 'తండ్రిలేని బిడ్డ ప్రభాకరం, తల్లివుండీ లేనివాడై, నీ వాడుగానే పెరుగుతున్నాడు దారాజా!' అన్నారాయన. వెన్నెలలాటి ఆయన చిరునవ్వులో కరిగిపోవటం తప్ప నేనేం చెయ్యగలనూ ?

* * *

పదహారేళ్ళతర్వాత మాట శైలజ పిల్లలతో పండక్కొచ్చింది. పెద్దది రాధికతర్వాత మరి యిద్దరు మొగపిల్లలూ, ఇద్ద రాడపిల్లలూను. శైలజ పిల్లలూ, ప్రభాకరం అంతా నన్ను బలవంతంచేసి సినిమాకి తీసుకెళ్ళారు. శైలజ రానన్నది. సావిత్రి ఎప్పుడూ బైటికి రాదు. వా రేదో సీరియస్ కేసుందని హాస్పిటల్ కెళ్ళిపోయారు.

సినిమా మరో గంటకి విడిచి పెడతారనగా విపరీతమైన తలపోటు వచ్చింది. నేనొక్కత్తెనే రిక్షామీద యింటికి వచ్చేశాను. తోటలో లైట్లు వెలగట్లేదు. వరండాలో తక్కువ కాంతి బల్బుముందు, పనిమనిషి మాణిక్యం, శైలజ కూతుర్ని ఒళ్ళో పెట్టుకుని ఏదో బొమ్మలపుస్తకం తిరగేస్తోంది. సావిత్రి లోపల ఎక్కడో వున్నట్లుంది. పైనకూడా చీకటిగానే వుంది. నేను మెట్లెక్కి పైకి వెళ్ళేటప్పటికి శైలజ గొంతు వినిపిస్తోంది.

నేను చటుక్కున ఆగిపోయాను. నా పేరే వినిపిస్తోంది.

'రాజ్యలక్ష్మికి పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చెయ్యమంటే చేశాననే చెప్పింది డాక్టరు సుభద్ర. నీ యిష్టప్రకారమే చెయ్యవలసి వచ్చిందని చెప్పింది. అప్పట్లో రాధికని నాకూతురుగా చెప్పమంటే, నీ మొహం చూసి జాలిపడి తొందరపడి ఒప్పుకున్నాను. తప్పకుండా యింకా పిల్లలు పుడతారు, తప్పేముందని సర్దుకో బోయాను. ఏళ్ళు గడుస్తున్న కొద్దీ, నాకు భయం, బాధా కలుగుతున్నాయి. వదిన మొహం చూసినప్పుడల్లా. చెప్పెయ్యాలనిపిస్తుంది. కానీ. నీ కిచ్చిన మాటకోసం కట్టుబడి పోయాను. ఓ అమ్మగన్న బిడ్డని యీ యింటి కోడలుగా తెచ్చి ఎందుకింత అన్యాయం చేశావన్నయ్యా ? నిజంచెప్పు. నీకు వంశాంకురం కావాలని ఎప్పుడూ అనిపించలేదా ?

'అన్నయ్యలోని బలహీనతని క్షమించు చెల్లాయ్, నీకు నేను సమాధానం చెప్పలేను' అన్న అన్నగారి వంక శైలజ జాలిగా చూస్తోందో, కోపంగా చూస్తోందో నాకు అవగాహన కాలేదు. టేబుల్ లైటు వెలుగులో అపరాధిలా కూర్చున్న ఆయన్ని మరొకసారిచూసి నిశ్శబ్దంగా వచ్చేశాను.

గుండెల్లో విపరీతమైన పోటు. నా మనసు రాధికచుట్టూ వలయాలుగా తిరుగుతోంది. పరిపూర్ణమైన తల్లిదండ్రుల ప్రేమను పొందవలసిన రాధికా వంచితురాలు ? భర్త ప్రేమకు విలువకట్టు సాధ్యం కాదని భ్రమసిపోయిన నేనా వంచితురాల్ని ?

● ● ●

ప్రభాకరం డైరీ చదవటం పూర్తయింది. విసురుగా డైరీ పుచ్చుకొని మావయ్య గదిలోకి నడిచాడు ప్రభాకరం.

'మావయ్యా, ఇది చదువు' అన్నాడు ప్రభాకరం, డైరీ బల్లమీద పెడుతూ, ఎటువంటి ఆవేశచిహ్నాలు కనుపించనీకుండా.

---

● ఒకడు : ఈ వళంగా లాటరీలో లక్ష రూపాయలొస్తే బట్టలకొట్టు తెరిచేస్తాను.

మరొకడు : లక్ష రూపాయిలు దేనికోయ్. మారుతాళాలుంటే ఈ రాత్రే తెరిచెయ్యొచ్చు.

—యస్నార్‌స్వామి, ధత్రపూర.

మావయ్య ఒక్కసారి తృప్తి ప్రభాకరం వంక చూసి,

"ఇలా వచ్చి కూర్చో ప్రభా!" అన్నాడు. మంత్ర ముగ్ధుడిలా వెళ్ళి కూర్చున్నాడు ప్రభాకరం.

"నేనూ చదివాను ప్రభా!" అన్నాడు మావయ్య డైరీ చేతిలోకి తీసుకుని.

ప్రభాకరం స్తబ్ధుగా వుండిపోయాడు.

"అత్తయ్య చెప్పినట్లు, యిదమిత్థంగా ఎవరికి వంచన జరిగిందో చెప్పను. నాది ఒకరకమైన మనస్తత్వమనుకుంటాను. అన్నపూర్ణ పిల్లల కోసం కలవరించి చనిపోయింది. ఈ యిల్లు అన్నపూర్ణ యిష్ట ప్రకారం కట్టిందే! నేనెంత దురదృష్టవంతుణ్ణో, డాక్టరయి వుండీ, అన్నపూర్ణని రక్షించలేక పోయాను. అప్పట్లో నా ధ్యేయం అన్నపూర్ణకి లేని అదృష్టం రాజ్యలక్ష్మికి పట్టకూడదనే! ఆమెను నేను చేసుకోవటమే ఆమె అదృష్టం. నాకేం లేదు? నేను నా వెల్తినీ, దురదృష్టాన్ని పూడ్చుకోలేను. కాని ప్రభా ఎంతటి సత్యాన్నయినా కాలమే నిరూపిస్తుంది. రాజ్యలక్ష్మి అనురాగం నన్ను చకితుణ్ణి చేసింది ప్రభా, ఎప్పుడన్నా నిజం చెప్పేద్దామనుకునేవాణ్ణి. కాని, కాని, ఏదో అదృశ్య శక్తి నన్ను నిశ్శబ్దంగా వుండిపోయేటట్లు చేసేది."

నిశ్చలంగా వున్న మావయ్య చూపుల్లోని అనురాగపు వెల్లువను ప్రభాకరం విస్మయంగా చూస్తూ వుండిపోయాడు.

● ● ●

ప్రభాకరం కథ చెప్పటం అయిపోయింది. నిలబడి కురుస్తున్న వర్షం కూడా ఆగిపోయింది. ప్రభాకరం మెల్లగా ప్రారంభించాడు. "భరద్వాజ్! నీ ముందు పుట్టి పెరిగిన చెల్లాయ్ రాసిన కథని నమ్మలేకపోవటానికి కారణం, ఒకే హెరిడిటీతో, ఒకే ఎన్విరాన్‌మెంట్‌లో పుట్టి పెరగటమే. అనుభవం తక్కువనీ, అదీగాక పెద్దవాడివిగా ఆమె భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కథని త్రోసిపారేశావ్. ఒప్పుకోవటానికి నీకు భయం. కథలోని వ్యక్తులను నిజజీవితంలో వూహిస్తే ఆమె సాంసారిక సుఖానికి ప్రతిబంధకం కావచ్చు. అదే నీ భయం. హెరిడిటీకి, ఎన్విరాన్‌మెంట్‌కి అందని ఏదో శక్తి మనుషుల్ని మానసికంగా మారిపోయేటట్లు చేస్తోంది. చెల్లాయ్ వూహ అందుకే నిజమైంది. నీలాంటి అన్నయ్య చేతిలో ఆమె వూహాలు రాణించవచ్చు. వస్తానిహ" ప్రభాకరం మెల్లిగా లేచి మెట్లుదిగి వెళ్ళిపోయాడు. అన్నయ్యా, నేనూ అచేతనంగా అతని వెనకనే నడిచి వీధి గుమ్మందాకా వెళ్ళాం. మున్సిపాలిటీ లైట్ల వెలుగులో చితచితలాడుతున్న తారురోడ్డుమీద నడిచి వెళుతున్న తెల్లటిబట్టల్లోని ప్రభాకరం మసక మసగ్గా కనిపిస్తూ దూరమయ్యాడు.

□□□



